క్లుప్తంగా

రేపు వేంకటేశ్వరస్వామి కల్యాణం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమిటీహాలులో ఈనెల 29 ఆదివారం శ్రీనివాస కల్యాణం ట్రస్ట్ మోతీనగర్ హౌసింగ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ అంజిరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7గంటలకు మోతీనగర్ శంకర్‌మఠం నుంచి కల్యాణ మండపం వరకు శోభయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి కేజీఎన్ దర్గా వార్షికోత్సవాలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పండిత్ నెహ్రూ నగర్‌లోని కేజీఎస్ దర్గా వార్షికోత్సవాలు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 28న శనివారం గ్రంథారాధన, 29న దీపారాధన, 30న కావలి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఇప్పటికే అభివృద్ధి పనులు పూర్తి చేశాం

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని ప్రజలకు పలు పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తూనే డివిజన్‌లో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేశామని కార్పొరేటర్ సబిహా బేగం అన్నారు. శుక్రవారం ఆమె రాజీవ్‌గాంధీనగర్ ఈ బ్లాక్‌లో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశు, సలావుద్దీన్, హాజీ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత విషయంలో రాజీ పడొద్దు



పీజేఆర్‌నగర్‌లో సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్, ఏఈ

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం ఏఈ శ్రావణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడొద్దన్నారు. రోడ్డుకు మంచి క్యూరింగ్ చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అగ్రవాసు, ఖాజా, వాసుదేవరావు, ముజీబ్, రేణుక, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

మూసాపేట: మూసాపేట ప్రగతినగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్‌లో శుక్రవారం వసంత పంచమి పురస్కరించుకొని సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గార్లపాటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అడ్మిషన్లు షురూ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సర అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కుత్బుల్లాపూర్ బాయ్స్ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ముస్లిం (24), ఎస్సీ (02), ఎస్టీ (03), బీసీ (05), ఓసీ (02) మొత్తం 36 సీట్లు, జూనియర్ ఇంటర్ ఎంఈసీలో ముస్లిం (25), ఎస్సీ (01), ఎస్టీ (02), బీసీ (02), ఓసీ (01) మొత్తం 31 సీట్లు, సీఈసీ జూనియర్ ఇంటర్‌లో ఎస్టీ (02), బీసీ (02), ఓసీ (01) మొత్తం 5 సీట్లు ఉన్నాయని, ఔత్సాహిక విద్యార్థులు ఇతర వివరాలకు 9553158618/ 7331170803 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

పార్కుల అభివృద్ధి కలేనా?



- ఆల్విన్‌కాలనీలో అధ్వానంగా పార్కుల నిర్వహణ
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా పార్కులు
- దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని వైనం

ఆల్విన్‌కాలనీ: ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందం, వినోదం కోసం సహజ వనరులతో అలరారే పార్కులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. పార్కుల ఆలనా పాలనా లేక వయో వృద్ధులే ప్రతిరోజూ పార్కులోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. కాలనీ ఏర్పడి నాలుగు దశాబ్దాలు గడిచినా ఇప్పటి వరకు పార్కు అభివృద్ధికి నోచుకోలేదు.



కూలిపోయిన హైమాస్ట్ విద్యుత్ స్తంభం



ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లోని జలకన్య సెంటర్‌లో ఉన్న పార్కు

జీహెచ్‌ఎంసీకి స్థలాల అప్పగింత..

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్–1, ఫేజ్–2లలో ఏ, బీ, సీ టైప్ క్వార్టర్స్‌ను ఆల్విన్‌కంపెనీ కార్మికులకు, ఉద్యోగుల కోసం కేటాయించి ఇళ్లను నిర్మించారు. ఈ కాలనీలో మూడు పార్కులు, క్రీడా మైదానాల కోసం స్థలాన్ని హౌసింగ్ సొసైటీ సభ్యులు కేటాయించి జీహెచ్‌ఎంసీ అధికారులకు అప్పగించారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా ఈ పార్కు ఆలనా పాలనకు నోచుకోలేదు.

సదుపాయాలు లేక పార్కు వైపు చూడని వైనం

జలకన్య సెంటర్‌లోని పార్కులో సీనియర్ సిటిజన్స్ మొక్కలు నాటుకొని వాటి సంరక్షణ కూడా వారే చూస్తున్నారు.అవి ప్రస్తుతం ఏపుగా పెరిగి వటవృక్షాలుగా ఎదిగి ఎంతోమందికి చల్లని నీడను ఇస్తున్నాయి.కానీ ఈ పార్కులో పచ్చని మైదానం కానీ,చిన్నారులకు ఆట వస్తువులు కానీ, వయో వృద్ధుల కోసం ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో చాలా మంది ఈ పార్కు వైపు చూడటం లేదు.

కబ్జా అవుతున్నా పట్టించుకోరు...

◆ ఆల్విన్‌కాలనీ ఫేజ్–1లోని పార్కులు ఇప్పటికే కబ్జాలకు గురయ్యాయి. వాటిపైన చర్యలు తీసుకున్నా కబ్జా ఆగలేదని పేర్కొంటున్నారు. అధికారులు కాసులకు కక్కుర్తికి ఆశపడి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పార్కులో లైటు లేదు.. మందుబాబులను అనేవారే లేరు..

ఈ పార్కులో పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇళ్ల మధ్యలో ఉన్నా కూడా ఆకతాయిలు, పోకిరీలకు మద్యం సేవిస్తూ అడ్డాగా మార్చుకున్నారు. మందుతాగి మందుసీసాలు అక్కడే పడేస్తున్నారు. ఈ పార్కులో కనీసం లైటింగ్ వ్యవస్థ కూడా లేదు. గతంలో ఈ పార్కులో హైమాస్ట్ వీధి లైటు ఉండేది. అది కాస్తా తుప్పు పట్టి నేలపై కూలిపోయింది. కనీసం దాన్ని తొలగించిన దాఖలాలు కూడా లేవు. కొత్త లైట్లు బిగించాలని అధికారులను వేడుకున్నా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు.




తాగి పడేసిన మందు సీసాలు, పేరుకుపోయిన చెత్తాచెదారం

అపరిశుభ్రంగా టాయిలెట్లు..

పార్కులో ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ టాయిలెట్‌లను సైతం శుభ్రం చేసే వారు లేరు. పార్కులోని మరుగుదొడ్లు వాడుకోవాలంటే అసౌకర్యంగా ఉంటుందని తెలుపుతున్నారు. పార్కు వద్ద ఉన్న విద్యుత్ మొటార్ సైతం పని చేయటం లేదు.



అసౌకర్యంగా ఉన్న టాయిలెట్



ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోయువతే ఏర్పాటు చేసుకున్న తాత్కాలికంగా షటిల్ కోర్టు

స్థలం ఇచ్చినా అభివృద్ధి చేయలేదు

◆ ఫేజ్–2లోని పార్కు స్థలాలు హౌసింగ్ సొసైటీ వారు సొసైటీ భవనం సమీపంలోని నాలా వద్ద పావు ఎకరం, శివాలయం వెనుక వీధిలో కొంత స్థలాన్ని కేటాయించారు. ఈ కేటాయించిన స్థలంలో ఎలాంటి అభివృద్ధి చేయక పోవటంతో స్థానిక యువత సొంత డబ్బుతో షటిల్ కోర్టు ఏర్పాటు చేసుకున్నారు. ఈ పార్కు స్థలాలు, క్రీడా మైదానాలను అధికారులు పరిశీలించాలని కోరతున్నారు. కబ్జా అయిన ఆ స్థలాలను స్వాధీనం చేసుకొని నిధులు వెచ్చించి ప్రణాళికాబద్ధంగా అందరికి అనువుగా ఉండేలా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పార్కుల అభివృద్ధి చేపట్టాలి



కాలనీలో వయోవృద్ధులకు సేదతీరడానికి అనువైన ప్రదేశాలు లేక అనారోగ్యాలకు గురవుతున్నారు. పార్కులను అభివృద్ధిలోకి తీసుకువచ్చి వారి కాలక్షేపానికి ఆటవస్తువులు, న్యూస్ పేపర్లు వంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పార్కుల్లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి మౌలిక వసతులతో పాటు లైట్లు ఏర్పాటు చేయాలి. పచ్చదనానికి కృషి చేయాలి. పార్కుల అభివృద్ధి చేపట్టాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆల్విన్‌కాలనీపై దృష్టి పెట్టి మౌలిక వసతులు కల్పిస్తే బాగుంటుంది.

– సాయిప్రభాకర్, ఆల్విన్‌కాలనీ

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం..



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే ఎమ్మెల్యే గాంధీ సహకారంతో లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ కెమెరాలు, శ్మశానవాటికల అభివృద్ధి, విద్యుత్, కూడళ్ల వద్ద కూర్చోవడానికి బల్లాలు కూడా ఏర్పాటు చేశాం. పార్కులు అభివృద్ధికి అధికారులతో చర్చించి త్వరలోనే అన్ని రకాల వసతులు కల్పించటానికి పాటుపడతాం.

– దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్

ఎనిమిదేళ్లలో డివిజన్‌ను సుందరంగా తీర్చిదిద్దాం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్‌లో కోటి 33 లక్షల 65వేల రూపాయలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎంతో మంది కార్మికులు నివసిస్తున్న బాలానగర్ ప్రాంతాన్ని గత పాలకులు పట్టించుకోలేదన్నారు. దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కేవలం ఎనిమిదేళ్ల కాలంలో వేల కోట్ల రూపాయలతో బాలానగర్ డివిజన్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. అందుకు నిదర్శనం ఈ ప్రాంతంలో నిర్మించిన ఫ్లై ఓవర్లేనని అన్నారు. అదే విధంగా ఇందిరానగర్ బస్తీరోడ్లు, పార్కులు, ఓపెన్ జిమ్, కమ్యూనిటీహాల్ నిర్మించామన్నారు. అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు.

సీఎంను విమర్శించే నైతికహక్కు బండి సంజయ్‌కు లేదు

బీఆర్‌ఎస్ నాయకుడు సింధం శ్రీకాంత్

భాగ్యనగర్‌కాలనీ: ప్రజాసంగ్రామ యాత్ర సందర్భంగా ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మత విద్వేషాలను రెచ్చగొడుతూ బరాబర్ రెచ్చగొడతాం అని వ్యాఖ్యానించి రాజ్యాంగాన్ని అవహేళన చేశారని బీఆర్‌ఎస్ నాయకుడు సింధం శ్రీకాంత్ అన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగే విధంగా మట్లాడిన బండి సంజయ్‌కు సీఎం కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. పిచ్చి పిచ్చి విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

విజయశాంతి జీవితం ఎంతో మందికి ఆదర్శం



విజయశాంతిని గజమాలతో సన్మానిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయకులు

కూకట్‌పల్లి: బీజేపీ సీనియర్ నాయకురాలు విజయశాంతి రాజకీయ ప్రయాణం 25 సంవత్సరాలు పూర్తి కావటంతో కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుక్రవారం విజయశాంతి నివాసానికి కార్యకర్తలు, నాయకులతో భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా విజయశాంతిని భారీ గజమాలతో సన్మానించి 25కిలోల కేక్‌ను కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సినీ నటిగా, ఉద్యమకారిణిగా, రాజకీయ నాయకురాలిగా ఎదిగిన తీరు ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పాలక్‌గా విజయశాంతి సహకారంతో బీజేపీని కూకట్‌పల్లిలో అగ్రస్థానంలోకి నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షుడు మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.



విజయశాంతితో కేక్ కట్ చేయిస్తున్న నాయకులు

భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీ, హనుమాన్‌నగర్ కాలనీల్లో రూ.9.6 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని పరిష్కరిస్తున్నామని తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు పెద్ద భాస్కర్, చంద్రకాంత్‌రావు, ఊట్ల చంద్రారెడ్డి, ఎల్లం నాయుడు, ఎండీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి

కంటి వెలుగుకు విశేష స్పందన

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. హరిజనబస్తీలోని కంటి వెలుగు కేంద్రంలో ప్రతిరోజు వంద మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షలు నిర్వహించి కంటి లోపలు ఉన్న వారికి కళ్లద్దాలను అందజేస్తున్నారు.

◆ గత వారం గంగపుత్ర సంఘంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించగా ఈ వారం హరిజనబస్తీలో ఏర్పాటు చేశారు. ఇక్కడ కంటి వెలుగుకు వచ్చే ప్రజలు తగ్గితే హస్మత్‌పేటలోని మోడల్ మార్కెట్‌లో ఏర్పాటు చేసేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అయా ప్రాంతాలను కవర్ చేసేందుకు వారం 10 రోజులకు మరో చోటగా మారుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ ప్రజలందరికి కంటి వెలుగు సెంటర్ అందుబాటులో ఉండేలా అందరూ సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికి సుమారుగా 800 మంది కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. అందులో 250 మంది కళ్లద్దాలు తీసుకున్నారు. అవసరమైన 90 మందికి కంటి ఆపరేషన్లకు రీఫర్ చేశామని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు కంటి వెలుగు సెంటర్‌కు వచ్చేలా ఆర్‌పిలు సురేఖ, సౌజన్య, సుప్రియ, సునిత, కృష్ణక్మి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



హరిజనబస్తీలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

సమాజ హితం.. రక్తదాన శిబిరం

హోలిస్టిక్ వైద్యశాల చైర్మన్ రామచంద్ర

కూకట్‌పల్లి: సమాజ హితం కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని హోలిస్టిక్ వైద్యశాల చైర్మన్ రామచంద్ర అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీకాలనీలో పి.దుర్గాదేవి, గోపీనాథ్‌యాదవ్ దంపతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్వింకిల్ స్టార్స్ ఫౌండేషన్‌ను ఆయన లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ఏ.వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైద్యశాలలో చేరిన రోగులకు రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేయటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ దుర్గాదేవి మాట్లాడుతూ.. ట్వింకిల్ స్టార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, అనాథలు, వృద్ధులకు చేయూతను అందించేందుకు కృషి చేస్తామన్నారు. 200 మంది రక్తదానం చేసిన రక్త నిల్వలను రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేసినట్లు ఆమె తెలిపారు.



రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న రామచంద్ర, సంస్థ ప్రతినిధులు

ఉన్నట్టుండి కుంగింది..




కూకట్‌పల్లి ముంబై జాతీయ రహదారిలో వివేకానందనగర్ కమాన్ వద్ద ప్రధాన రహదారి కుంగింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ రహదారి రెండు ఫీట్ల లోతులో కుంగి పోయి ఖాళీగా కనిపిస్తోంది. వెంటనే స్థానికులు పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సమాచారం అందించారు. రోడ్డు ప్రదేశాన్ని పరిశీలించి అటుగా వచ్చే వాహనాలు వెళ్లకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు దగ్గరుండి కుంగిపోయిన ప్రదేశాన్ని పరిశీలించి మరమ్మతులు చేయించారు. – ఆల్విన్‌కాలనీ

ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం



అబ్రహార్‌నగర్‌లో వివరాలను తెలుసుకుంటున్న బూత్ లెవల్ అధికారి రాజు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట అబ్రహార్‌నగర్‌లో బూత్ లెవల్ ఆఫీసరు రాజు ఇంటింటికీ తిరిగి ఓటర్‌కార్డుకు ఆధార్ అనుంధానం అయ్యిందా కాలేదా అని ఆరా తీశారు. బూత్ లెవల్ ఆఫీసర్‌కు తోడుగా డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జహంగీర్, నాయకులు ఇంటింటికి తిరిగి ఓటర్‌కార్డు ఉన్న వాళ్లు ఉన్నారా? ఇతర ప్రాంతాలకు వెళ్లారా? ఎవరైన మృతి చెందారా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



పోలీసుల సమక్షంలో మహిళకు బ్యాగును అప్పగిస్తున్న ఆటోడ్రైవర్ కృష్ణ

భాగ్యనగర్‌కాలనీ: ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకొని ప్రయాణీకురాలు మర్చిపోయిన బ్యాగును తిరిగి ఇచ్చాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సూరారంకు చెందిన లెల్ల రమాదేవి కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని తన బంధువుల ఇంటికి ర్యాపిడో ఆటోలో చేరుకుంది. ఆటో దిగిన సమయంలో తన బ్యాగును మర్చిపోయింది. తన బ్యాగు మర్చిపోయినట్లు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హఫీజ్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ యెదుల కృష్ణకు ఫోన్ నంబర్ ఆధారంగా ఫోన్ చేయడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బ్యాగు మర్చిపోయిన మహిళ, పోలీసుల సమక్షంలో అందజేశాడు. బ్యాగులో ఐదు తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిజాయితీగా మర్చిపోయిన బ్యాగును మహిళకు ఇవ్వడం పట్ల ఆటో డ్రైవర్‌ను పోలీసులు అభినందించారు.

పరీక్షా పే చర్చ

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో బీజేపీ సీనియర్ నాయకులు తూము వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో కలిసి ప్రధాని మోదీ నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా తూము వేణుగోపాల్ మాట్లాడుతూ... నేటి బాలలపైనే రేపటి భారత్ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. ఒత్తిళ్లు లేకుండా పరీక్షలు రాసి తమ లక్ష్యానికి చేరుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాస్త్రి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.